ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889



మేడ్చల్ | శుక్రవారం | 10.04.2026 | సంపుటి : 1 | సంచిక : 283 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్


# రేవంత్ కన్నా.. కేసీఆర్ పాలనే బెటర్

## కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కేసీఆర్

తెలంగాణ ఏర్పాటు కేసీఆర్ వల్లనే సాకారమయ్యింది

జాతీయ స్థాయిలో బిజెపి.. రాష్ట్రంలో కేసీఆర్ బెటర్

మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన



**నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం**

రాజకీయాల్లో నిఖార్సయిన నేత

జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కేటీఆర్ 02

జగిత్యాలలో జీవన్‌తో భేటీ

జగిత్యాల, ఏప్రిల్ 9 : రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు.

-మిగతా 2 లో..

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.



ఖమ్మం, ఏప్రిల్ 9 : అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు

-మిగతా 2 లో..



# జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

గతంలో కేసీఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా

## పొంగులేటిపై ఆరోపణలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి

మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు.

హైదరాబాద్, ఏప్రిల్ 9 : ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు.

-మిగతా 4 లో..



# మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

## భారీగా పోలింగ్ శాతం నమోదు

అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం

అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 : ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరా రు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ

-మిగతా 2 లో..

# పాక్‌ను ముందు పెట్టి అమెరికా నాటకం

## హార్ముజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ

లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి

40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది.



అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 : ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రా యెల్ లెబనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది.

-మిగతా 06 లో..



# ఎమ్మెల్యే పల్లాను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు

## కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ

పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే

ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు.

-మిగతా 4 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 242 (కిలో) |
| స్కిన్ లెస్ | 276 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹64

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

## షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్

బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు

హైదరాబాద్,ఏప్రిల్9(ఆర్ ఎన్ఎ): భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ము మ్మరం చేసింది. ఇందులో

-మిగతా 2 లో..





# గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక సదుపాయాలు

## పుష్కరాల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

హైదాబాద్, ఏప్రిల్ 9 : రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజర య్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగ కుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన

-మిగతా 2 లో..

# పొంగులేటి కాదు.. పొంగులూటీ

## బాంబులు పేలుతాయన్న బాంబులేటి

అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు 02

క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు

నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు

గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం





## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం

(మొదటిపేజీ తరువాయి)

ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.జ

## పొంగులేటి కాదు.. పొంగులూటీ

**వనపర్తి, ఏప్రిల్ 9 :** పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్ధాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యంగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పంపించి, కాంపౌండ్ వాల్ కూలగొట్టి, ఆక్రమణలను కూల్చి రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలన్నారు. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటీ అని దుయ్యబట్టారు. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుందని హరీశ్ రావు ప్రశ్నించారు.

## వరి కొనుగోలు మరో 2 నెలలు పెంచాలి

### కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడువు పెంచాలని కోరారు. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

# రేవంత్ కన్నా.. కేసీఆర్ పాలనే బెటర్

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయి-లో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధు లు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపా నికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వ కుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారు-ణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- రాజకీయాల్లో నిఖార్సయిన నేత
- జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కేటీఆర్
- జగిత్యాలలో జీవన్‌తో భేటీ

**జగిత్యాల, ఏప్రిల్ 9 :** ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నా యన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా.. బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు.. 2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.

## మూడు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)



ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



## గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక సదుపాయాలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈ.ఎన్.సి.లు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)




భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ , కె. శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు

## ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 10 గంటల నుంచే భానుడి భగభగలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరో 3 డిగ్రీలు పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గురువారం ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, మిగతా అన్ని జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఎండలు, వడగాలులతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.






## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

- చిర, చరాస్థులు కూడా లేవు
- సొంత ఇల్లు అంతకన్నా లేదు
- బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ

**కోల్‌కతా, ఏప్రిల్ 9 :** మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు. గత ఐదేళ్లలో మమత బెనర్జీ ఆస్తులు తగ్గడం గమనార్హం. కాగా, 2021లో ఆమె చరాస్తులు విలువ రూ.16.72లక్షలుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 4.2025-26 ఆర్థిక సంవత్సరంలో దీదీకి రూ.40,600 టీడీఎస్ రిఫండ్ వచ్చినట్లు తన అఫిడవిట్‌లో తెలిపారు. ఇక రాయల్టీలు, బ్యాంక్ వడ్డీలు తన ప్రాథమిక ఆదాయ వనరుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నామినేషన్ పత్రాల్లో కాళీఘాట్‌లోని 30 డి హరీశ్ చటర్జీ వీధిని తన చిరునామాగా పేర్కొన్నారు మమతా బెనర్జీ. అయితే, ఆ ఇల్లు ఆమె పేరిట రిజిస్ట్రేర్ మాత్రం కాలేదు. ఇప్పటి వరకు తనకంటూ ఒక సొంత ఇల్లు లేదని ఆమె అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం.

## ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

### వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 - ఏప్రిల్ 22, 2016 - ఏప్రిల్ 22, 2017 - ఏప్రిల్ 16, 2018 - ఏప్రిల్ 13, 2019 -ఏప్రిల్ 18, 2020 - జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021-జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 - జూన్ 28, 2023 - మే 9, 2024 - ఏప్రిల్ 24, 2025 -ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.

## తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

### మంత్రి సీతక్క వ్యాఖ్యలు

**మహబూబాబాద్, ఏప్రిల్ 9 :** తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ అధికారులు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 9 :** జిల్లాలో బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి , జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ ఏసీబీవలకు చిక్కారు. హరిత హారంలో జాతీయ గ్రామిణ హామీ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెక్ డ్యాంలో నీటిని నింపిన బాధితుడికి సుమారు రూ.5లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగిన బాధి తుడు చివరకు బోథ్ ఫారెస్టు రేంజ్ అధికారి టి. ప్రణయ్ రూ.15వేల డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు జూనియర్ అసిస్టెంట్ పరుశురాంకు రూ.15 వేలు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది. విచారించగా ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు డబ్బు తీసుకున్నట్లు అంగీకరించడంతో ఇద్దరిని కస్టడీలోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

## కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

**వరంగల్, ఏప్రిల్ 9 :** వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. సోషల్ మీడియాలో సీనియర్లపై కామెంట్స్ చేసిన థర్డ్ ఇయర్ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ కమిటీ చర్యలకు సిఫారసు చేసింది. వాటిని కళాశాల అమలు చేసింది. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం వాట్సాప్ గ్రూప్‌లో సీనియర్లపై కామెంట్ చేశారని ద్వితీయ సంవత్సరం విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో థర్డ్ ఇయర్ విద్యార్థులు మోకాళ్లపై కూర్చోబెట్టారు. బాధిత విద్యార్థులు ఈ విషయాన్ని కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకి పిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కమిటీ విచారణ చేపట్టి కారకులను మూడు నెలల అకడమిక్ సస్పెన్షన్, శాశ్వత హాస్టల్ వసతిని రద్దు చేస్తూ చర్యలకు సిఫారసు చేసింది. కమిటీ సిఫారసులను కళాశాల అమలు చేసింది. అయితే, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

## యువతిపై సామూహిక హత్యాచారం

**వరంగల్, ఏప్రిల్ 9 :** రాయపర్తి మండలంలో సామూహిక హత్యాచారం తీవ్ర కలకలం రేపింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై నలుగురు యువకులు హత్యాచారానికి పాల్పడ్డారు. తమ కుమార్తె(21)పై బుధవారం రాత్రి రావూరు తండాకి చెందిన నలుగురు అత్యాచారం చేశారని యువతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత అత్యంత పాశవికంగా ఆమెను చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను ఉరి వేసి చంపేశారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. బాధితురాలు తీవ్ర రక్త స్రావంతో మృతిచెందిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వర్ధన్నపేటలో మార్చురీ ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 11 రోజుల్లో రెట్టింపు డబ్బు

### డాక్టర్‌ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు
### ఏకంగా రూ.12.31 కోట్లు దోచేసిన దుండగులు

**పుణె, ఏప్రిల్ 9 :** పుణెలో 75 ఏళ్ల వైద్యుడు సైబర్ మోసగాళ్ల చేతిలో భారీ దోపిడీకి గురయ్యారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా 11 రోజుల్లో డబ్బు రెట్టింపు అవుతుందంటూ దుండగులు నమ్మించి అతడి నుంచి ఏకంగా రూ.12.31 కోట్లు దోచేశారు. చివరికి మోసపోయానని తెలుసుకున్న ఆ వృద్ధుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మీ వద్ద ఉన్న డబ్బుని పెట్టుబడి పెడితే 11 రోజుల్లో రూ.54 కోట్లు చేస్తామని సైబర్ నేరగాళ్లు ఓ వైద్యుడిని నమ్మించారు. డబ్బుపై అత్యాశతో వారు పంపిన వివిధ బ్యాంకు ఖాతాలకు అతడు ఎనిమిది విడతలుగా డబ్బును బదిలీ చేశారు. ఇదంతా జనవరిలోనే మొదలైంది. 'మీరు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే ఆ మొత్తానికి రెండితల లాభాలు వస్తాయి' అంటూ ఓ గుర్తు తెలియని నంబరు నుంచి బాధితుడి మొబైల్ ఫోన్‌కి ఈ ఏడాది జనవరిలోనే మెసేజ్ వచ్చింది. దీనిపై బాధితుడు ఆసక్తి చూపడంతో సైబర్ నేరగాళ్లు అతడిని అనే వాట్సప్ గ్రూప్‌లో చేర్చారు. నిందితులంతా స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడితే ఎలాంటి లాభాలు పొందొచ్చనే అంశాలపై ఆ గ్రూప్‌లో చర్చించేవారు. దీంతో బాధితుడికి వారిపై నమ్మకం కుదిరింది. వారు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తే కేవలం 11 రోజుల్లోనే డబ్బు రెట్టింపు అవుతుందని పదే పదే చెప్పేవారని పోలీసులు పేర్కొన్నారు. సైబర్ మోసగాళ్ల వలకు చిక్కిన ఆ వైద్యుడికి అంతర్జాతీయ ట్రేడింగ్



కంపెనీని పోలిన ఓ మోసపూరిత యాప్ లింక్‌ని పంపించి అందులో వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో బాధితుడు మార్చి 7 నుంచి 18 మధ్య మొత్తంగా రూ.12.31 కోట్లు బదిలీ చేశాడు. నకిలీ యాప్‌లో లాభాలు వచ్చాయంటూ, నగదు రెట్టింపు అయిందంటూ భ్రమలు కల్పించారు. మరింత పెట్టుబడి పెట్టాలంటూ వారు బలవంతం చేశారు. బాధితుడు సంకోచించడంతో అకౌంట్‌లో ఉన్న నగదును సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పాలమూరు వలస జిల్లాగా మారటానికి కాంగ్రెస్ పార్టీనే కారణం

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను ఎందుకు పూర్తి చేయలే
- సిఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు ప్రశ్న

**వనపర్తి, ఏప్రిల్ 9 :** పాలమూరు వలస జిల్లాగా మారటానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.30 వేల కోట్లు ఖర్చు చేసి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 80 శాతం పూర్తి చేశామని ఆయన చెప్పారు. మిగిలిన 20 శాతం పనులు చేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండుంటే పాలమూరు జిల్లా ఇప్పటికే పూర్తిస్థాయిలో సస్యశ్యామలం అయ్యేదని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందన్నారు. కానీ, రేవంత్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు, కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు పిల్లి అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అవసరం లేని గొల్లపల్లి-చీర్కపల్లి రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తున్నారని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. జూరాల వద్ద పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టాలని తాను కోరుతున్నట్లు చెప్పారు. తమ పాలనలో ఈ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని గుర్తు చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి గొప్పలు చేసినట్టు కేరళంలో పల్లకీ మోస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కిందని ఆగ్రహించారు. ఇప్పటికే మూడు రైతు బందులు ఎగ్గొట్టారని.. ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాపీ జరిగిందా? అంటూ ప్రశ్నించారు. నాలుగు విడతల రైతు బందు వచ్చిందని రైతులు చెపితే తన పదవికి రాజీనామా చేస్తానని.. లేకుంటే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామాకు రెడీనా అంటూ సవాల్ విసిరారు. మొక్కజొన్నలు కొనుగోలు చేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వంతో పోరాటం చేసి గొల్లపల్లి, చీర్కపల్లి గ్రామాలకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెట్టే కేసులకు కార్యకర్తల భయపడాల్సిన పని లేదని.. రెండేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అని అన్నారు. ఈసారి అధికారంలోకి వస్తానని సీఎం రేవంత్ పగటి కలలు కంటున్నారని.. ఆయన ఉంటే ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు.

## నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

### మాటువేసి దుండగుడి పట్టివేత

**నల్లగొండ, ఏప్రిల్ 9 :** కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా డాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

## కేంద్ర చట్టానికి నిరసనగా ట్రాన్స్‌జెండర్ల ప్రదర్శన

**నాగర్‌కర్నూల్,ఏప్రిల్ 9 :** ట్రాన్స్ జెండర్ల హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాన్స్ జెండర్లు భారీ ధర్నా నిర్వహించారు. ఈ చట్టం తమకు అనుకూలంగా లేదని వాపోయారు. ఈ సందర్భంగా కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాజంలో తమకు సమాన హక్కులు కల్పించాలని కోరారు. వివక్ష లేకుండా గౌరవప్రదమైన జీవనం కావాలని, ట్రాన్స్ జెండర్ల కోసం చట్టాల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

## జీవన్ రెడ్డి పార్టీని వీడడం దురదృష్టకరం

### అధిష్ఠానం పిలిచి చర్చిస్తే బాగుండేది : జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడడం బాధాకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం ఖాయమవ్వడంతో ఢిల్లీ నాయకత్వం చొరవ చూపి ఉంటే సమస్య పరిష్కారమయ్యేదని జగ్గారెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాంపులపై కాంగ్రెస్ వైఖరిని ఖండిస్తూ వచ్చిన ఆయన గులాబీ జెండా కప్పుకోనున్న నేపథ్యంలో జగ్గారెడ్డి ఏఐసీసీ స్థాయిలో చర్చ అవసరమని పేర్కొన్నారు. జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ వీడడంపై ఆ పార్టీ సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉన్న జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం అని పేర్కొన్నాడు. కీలక నేత దూరమవ్వడంపై స్పందించిన ఆయన అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసి స్థాయిలో చెక్ చేసుకొని ఉండాల్సింది అని తెలిపారు.కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ తీరుతో అసంతృప్తిగా ఉన్న జీవన్ రెడ్డితో నేరుగా ఢిల్లీ నాయకత్వమే మాట్లాడి.. నేరుగా రంగం లోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేది అని ఆయన వెల్లడించారు. అయితే.. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని జగ్గారెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డి పార్టీ మారడానికి గల కారణాలను బహిరంగగా మీడియాతో చెప్పలేమని.. అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

## సంపాదకీయం

# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు!



**ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు.**

ఇరాన్ నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి.

దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది.

దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హోర్ముజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణమైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని

# బురిడీ కొట్టించిన సైబర్ నేరగాడు

- కేంద్ర పథకం చెప్పి లక్ష రూపాయాలు లూటీ
- పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే



**జనగామ, ఏప్రిల్ 9 :** ఇప్పటి వరకు అనేకమందిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైబర్ నేరస్థుడి చేతిలో మోసపోయారు. ఆయన నుంచి ఓ సైబర్ నేరస్థుడు రూ.లక్ష కొట్టేశాడు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి.. తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఓ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు చెప్పాడు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.2500 చెల్లించాలని నమ్మబలికాడు. దీంతో తన నియోజకవర్గంలోని యువతకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో సదరు అపరిచిత వ్యక్తికి ఎమ్మెల్యే పల్లా.. రూ.లక్ష ఫోన్ పే చేశారు. ఆ తర్వాత ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా? అని అడిగారు. డబ్బులు రాలేదని ఆయన సమాధానం చెప్పడంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా.. జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ రకంగా బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సైబర్ నేరగాళ్ల బారిన పడటం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వయంగా ఒక ప్రజాప్రతినిధిని, అది కూడా ప్రభుత్వ ఉన్నతాధికారి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు కేవలం సామాన్యులనే కాకుండా, అత్యున్నత పదవుల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఎమ్మెల్యే వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారే మోసపోయారంటే, సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవడమే దీనికి ఏకైక పరిష్కారమని పలువురు చెబుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తనను తాను తెలంగాణ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డిగా పరిచయం చేసుకున్నాడు. ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిగా నమ్మించడంతో ఎమ్మెల్యే సదరు వ్యక్తి మాటలను విశ్వసించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'వికసిత్ భారత్' పథకం కింద ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామని నిందితుడు నమ్మించాడు. నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్ధిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున, మొత్తం 40 మందికి కలిపి రూ. లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ లక్ష రూపాయలను నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అది నకిలీ కాల్ అని తెలియడంతో ఎమ్మెల్యే జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. సైబర్ నిందితులపై ఈ క్రింది సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు, వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికి కూడా వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరారని అన్నారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్

# అన్నివిధాల ఆదరించింది

- గతంలో కేసీఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
- పొంగులేటిపై ఆరోపణలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి
- మీడియాతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

**పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన పల్లా**

**జనగామ, ఏప్రిల్ 9 :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే కచ్చితంగా వారితో మాట్లాడి పరిష్కరి స్తానని స్పష్టం చేసారు. జనగామ నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

- పాఠశాల కాంపౌండ్ వాల్ కూల్చివేత దుర్మార్గం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపి రఘునందన్ వినతి

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 :** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ ప్రజాసంక్షేమం కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా .. పాఠశాల తరగతి గదులను కూల్చివేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించి పాఠశాల గదులను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల కూల్చివేతలపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.



## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

**శాంతియుత నిరసనలతో ఖండించాలి**
**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**చిత్తూరు, ఏప్రిల్ 9 :** పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎన్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ఆరు గ్యారెంటీలకు దిక్కేది?

**మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

**హన్మకొండ, ఏప్రిల్ 9 :** రైతుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అని నమ్మించి.. ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండగలా ఉండేదని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వేళల్లో రైతులకు అండగా ఉండేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసి వ్యవయానికి 24 గంటల కరెంట్ ఇచ్చామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలుచేయలేదని విమర్శించారు. అంగన్‌వాడీలు రోజూ రోడెక్కి పోరాడుతున్నారని తెలిపారు. ఆశావర్కర్లది కూడా అదే పరిస్థితి అని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నెరవేర్చారని తెలిపారు. రూ.4వేలు ఉన్న జీతాన్ని రూ.7వేలకు పెంచారని గుర్తుచేశారు. మళ్లీ జీతం సరిపోవడం లేదంటే రూ.10,500కు పెంచారని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వానిది, తెలంగాణ ఉద్యోగులది పేగుబంధంలా ఉండేదని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగులకు జీతాలు పెంచామని తెలిపారు. నిరసనలు తెలపక ముందే వారి సమస్యలు పరిష్కరించామని పేర్కొన్నారు.



## మాజీ సొసైటీ అధ్యక్షుడు నరేష్ రెడ్డిని కలిసిన గ్రామవాసి సుందర్

**తిరుమలయాపాలెం, ఏప్రిల్ 9:** మాజీ సొసైటీ అధ్యక్షుడు రామసహాయం నరేష్ రెడ్డిని శుభలేఖ గ్రామానికి చెందిన కమ్మల సుందర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో తన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తన స్వగ్రామంలో చిన్న ఇంటి స్థలం మాత్రమే ఉందని, అదే స్థలంలో రెండు గదుల ఇల్లు నిర్మించుకుని గ్రామంలోనే ఉంటున్నట్లు సుందర్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని నరేష్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా గతంలో గ్రామ అభివృద్ధికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వీరన్న, గంధసిరి సత్యం తదితరులు పాల్గొన్నారు.



## అతివేగంతో ఫ్లై యాష్ ట్యాంకర్ బోల్తా

### డ్రైవర్ మృతి

**బోనకల్, ఏప్రిల్ 9:** మండల పరిధిలోని పెద్ద బీరవల్లి గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ దుర్మరణం చెందారు. వివరాల ప్రకారం, కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీ రామాంజనేయ ట్రాన్స్‌పోర్ట్స్‌కు చెందిన ఏపీ 39 టీ 6979 నంబర్ గల ఫ్లై యాష్ ట్యాంకర్ కొత్తగూడెం నుండి జగ్గయ్యపేట వైపు వెళ్తుండగా, పెద్ద బీరవల్లి సమీపంలోని మూలమలుపు వద్ద అతివేగంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చక్రపాణి ట్యాంకర్ కింద ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బోనకల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## యోగాను దినచర్యగా మార్చుకోవాలి

### బడంగ్ పేట డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 9:** అనారోగ్య సమస్యలు దూరం చేసుకోవాలంటే ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగంగా చేర్చుకోవాలని శంషాబాద్ జోన్ బడంగ్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య సూచించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మీర్ పేట డివిజన్లోని జిల్లెల్ల గూడా లోని చందన చెరువు పార్క్ లో యోగా శిబిర నిర్వహించారు ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది వాకర్స్తో కలిసి ఆయన ఆసనాలు వేశారు ఈ కార్యక్రమంలో సర్కిల్ ప్రవీణ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత ప్రపంచం భావితరాలకు బహుమానం

- గుండంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని దిల్సుఖ్నగర్ నుండి బి.యన్.రెడ్డి వరకు ప్లాస్టిక్ నిషేధం
- శ్రీ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మిడిదొడ్డి నరసింహ



**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 9:** క్యాన్సర్ కు కారకమైన ప్లాస్టిక్ నిషేధం పై పెద్ద ఎత్తున ఒక ఉద్యమాన్ని చేపట్టినట్లు శ్రీ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిడిదొడ్డి నరసింహ పేర్కొన్నారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ప్రపంచం భావితరాలకు బహుమానం అని అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో ప్లాస్టిక్ పై ఇటీవల నిషేధం విధించి పేపర్ ప్లేట్ల పై నిషేధం విధించి స్టీల్ పాత్రలు స్టీల్ గ్లాసులు ఉపయోగించడం పై పత్రికలలో టీవీలలో చూసి అలాంటి ఉద్యమమే రంగారెడ్డి జిల్లా దిల్సుఖ్నగర్ ప్రాంతం నుండి బి ఎన్ రెడ్డి వరకు కొనసాగించాలని నిర్ణయించామని మిడిదొడ్డి నరసింహ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్లాస్టిక్ పేపర్ల వినియోగం మొబైల్ ఐస్ క్రీమ్ బండ్ల విక్రయాలపై నిషేధం విధిస్తూ, ఒక ఉద్యమాన్ని ప్రారంభించామని, ఈ ప్రాంతాలలో ఎక్కడ శుభకార్యాలు జరిగిన చిన్నపాటి వేడుకలు జరిగిన ఇకపై స్టీల్ ప్లేట్లు లేదా విస్తారాకులు మాత్రమే వాడాలని ప్రజలలో ఒక అవగాహన తీసుకురావడం జరుగుతుందని అన్నారు, సహజమైన అరటి ఆకులు మోదుగా విస్తరాకులు వినియోగించాలని అదే విధంగా గల్లీలలో తిరిగే మొబైల్ ఐస్ క్రీమ్ బండ్ల ద్వారా విక్రయించే ఐస్క్రీమ్ లలో ఉండే రంగులు నాణ్యతలేని ముడి సరుకుల వల్ల చిన్నారులకు తరచూ జ్వరం గొంతు నొప్పి ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారని గుర్తించి వాటిని కూడా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వస్తువులు ఉదాహరణకు ప్లాస్టిక్ సంచులు బాటిళ్లు వాటి కణాలు భూతల మానవులకు ఇతర జీవరాసులకు వాటి ఆవాసాలకు తీవ్రమైన హాని కలిగించే అవకాశం ఉందని ఇట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ నిషేధం ఎంతైనా అవసరమని అన్నారు పర్యావరణ విధ్వంసానికి ప్లాస్టిక్ దోహదం చేస్తుందని, పేపర్ ప్లేట్లుగా చెప్పబడే ప్లాస్టిక్ ప్లేట్ల లో వేడి పదార్థాలు తినడం వల్ల అవి మానవ శరీరంలోకి ప్రవేశించి క్యాన్సర్ వ్యాధిని వ్యాప్తి చేస్తాయని ప్లాస్టిక్ సంచులు డ్రైనేజీ సిస్టం లోకి వెళ్లి వాటిని మూసి వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి నీరు కలుషిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్లాస్టిక్ మట్టిని కలుషితం చేస్తుంది అని ప్లాస్టిక్ అనేది జీవ విచ్ఛిన్న కరవక కృత్రిమ పదార్థమని మనం అన్ని రోజువారి ఉత్పత్తులలో దీనిని విరివిగా వినియోగిస్తున్నామని ప్లాస్టిక్ పేరకపోవడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని పర్యావరణంలో హానికరమైన రసాయనాలను విడుదల చేస్తాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఈ ప్రాంత ప్రజలంతా ప్లాస్టిక్ నిషేధానికి ఈరోజు నుంచే వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకోవాలని మిడిదొడ్డి నరసింహ కోరారు.

## బడంగ్‌పేట బడా అవినీతిపై ముఖ్యమంత్రి స్పందించాలి

### బడంగ్ పేట భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు రామిడి రామిరెడ్డి డిమాండ్



**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 9:** మాజీ విద్యా శాఖ మంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకే బడంగ్ పేట కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం రాజకీయంగా సంచలనం రేపింది. ఈ సందర్భంగా రామిడి రామిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లో విత్తలవిడిగా అవినీతి జరిగిందని ఏకంగా 150 కోట్లు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ చరిత్రలో భారీ స్థాయిలో అవినీతి జరగడం ఇందులో అక్రమాలకు పాల్పడిన డిప్యూటీ కమిషనర్ తో పాటు మొత్తం పదిమంది అధికారులు సస్పెండ్ కావడం రాష్ట్రంలోనే పెను సంచలనమైన నేపథ్యంలో మునిసిపల్ శాఖ వ్యవహారాలు చూస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడంగ్ పేట వుదంతపై స్పందించాలని వారు డిమాండ్ చేశారు. పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్స్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో పార్టీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ పెద్దబావి ఆనంద్ రెడ్డి బడంగ్ పేట మాజీకౌన్సిలర్ మాజీ ఫ్లోర్ లీడర్ సుర్ణ గంటి అర్జున్ మాజీ కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి యువ నాయకులు గట్టు మహిపాల్ తదితరులు బడంగ్ పేటలో అవినీతిపై వాస్తవాలు కప్పిపుచ్చే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న కాంగ్రెస్ నేతల తీరుపై అగ్గి మీద గుగ్గిలం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 డిసెంబర్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడంగ్ పేటలో యదేచ్ఛగా అవినీతి జరిగిందని దీనికి బాధ్యులైన కమిషనర్లు ఇతర అధికారులు సస్పెండ్ కావడమే నిదర్శనమని అన్నారు అంతకుముందు భారత రాష్ట్ర సమితి పాలనలో మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పనిచేసిన అధికారులు ఏ ఒక్కరి పేరు లేకపోవడం బట్టి చూస్తే ఈ రెండు ప్రభుత్వ శాఖలలో అవినీతిని ప్రోత్సహించింది ఎవరు అర్థం అవుతుందని వారు అన్నారు. సబితా ఇంద్రారెడ్డి బడంగ్ పేటను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసి ఇక్కడి భూములు ప్రజల ఆస్తుల విలువ పెంచితే కాంగ్రెస్ పాలనలో మాత్రం బడంగ్ పేటను భ్రష్టు పట్టించారని రచ్చ చేశారని వారన్నారు. 100 కోట్లకు పైగా అవినీతి జరిగి పెద్ద సంఖ్యలో అధికారులు సస్పెండ్ అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. అదేవిధంగా జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు సైతం నోరు మెదపడం లేదని అన్నారు ప్రోటోకాల్ పాటించకుండా అధికారిక కార్యక్రమాలకు వచ్చి కూర్చునే కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి వల్లనే అవినీతి అధికారులు బడంగ్ పేటకు వచ్చారని వారు ఆరోపించారు. బడంగ్ పేట అవినీతి వెనుక ఉన్నవారు ఎవరైనా సరే వారి పేర్లను బహిర్గతం చేయాలని సస్పెండ్ అయిన కమిషనర్ సరస్వతి ఇతర అధికారులు నోరు విప్పాలని వారి డిమాండ్ చేశారు. బడంగ్ పేటలో ఆనాడు ఉన్న స్పెషలాఫీసర్ శ్రీనివాసరెడ్డి కిందిస్థాయి వారు ఇంతగా అవినీతి చేస్తుంటే తాను ఏమి చేశారు అనేది కూడా తేలాలని ఏ ప్రభుత్వ పాలనలో బడంగ్ పేటలో అవినీతి పెరిగిందో ప్రజలు గమనించారని అయితే కాంగ్రెస్ బిజెపి నేతలు మాత్రం సవిత ఇంద్రారెడ్డి అవినీతిపై స్పందించాలని కోరడం హాస్యాస్పదమని వారు ఎద్దేవా చేశారు సబితా రెడ్డి స్పందించినందునే తాము ఆమె సూచనలు మేరకు ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాలని మీడియా సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు ఇంకా ఈ సమావేశంలో విఆర్ఎస్ నాయకుడు భీమిడి జంగారెడ్డి ఎర్రబట్టు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## గర్భఫలం యెహోవా బహుమానం : సుగంధ

- భూంపల్లి శ్రీనివాస్ నివాసంలో కృతజ్ఞత కూడిక
- శాంసన్ మానస పుణ్య దంపతులకు దేవుని ఆశీర్వాదం



**బోడుప్పల్, ఏప్రిల్ 9 (జనం వార్త) :** గర్భఫలము యెహోవా అనుగ్రహించు బహుమానమేనని హెబ్రోన్ దైవజనురాలు సహోదరి సుగంధ అన్నారు. గురువారం బోడుప్పల్ పరిధిలోని రాజశేఖర్ కాలనీలో భూంపల్లి శ్రీనివాస్ భార్గవి స్వగృహంలో క్రైస్తవ సహోదరీల ప్రత్యేక గృహ కూడిక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భూంపల్లి శాంసన్ మానస పుణ్య దంపతులకు దేవుడు అనుగ్రహించిన గర్భఫలముకు కృతజ్ఞత పూర్వక ప్రత్యేక కూడికను ఘనంగా దేవునికి మహిమకరంగా నిర్వహించారు. అనంతరం విశ్వాసులకు బంధువులకు ప్రేమా విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు కళ్యాణి, సునిత, జైరాజు శార, విలియం భాను, తీగల జేమ్స్ అనసూయ, జీవన్ అనుష, ప్రసాద్ నీలిమ, ప్రిస్కిల్లా (స్వీటీ) భరత్ రాజేశ్వరి, విజయ్ కుమార్, శేషు కుమార్, మేక పోతుల సైదులు కవిత, రాములు సైదమ్మ, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## సొంత లాభం కొంత మానుకోలేరా?

### బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్కలంక శ్రీనివాసరావు



**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 9:** సంపన్న శ్రేణి రిజర్వేషన్ల లబ్ధిదారులు సమాజంలో ఒక మెట్టు ఎక్కిన తర్వాత సంతృప్తి చెంది తమ వెనుక ఉన్నవారి స్థితిని గమనించి స్వచ్ఛందంగా రిజర్వేషన్లు మాకు అవసరం లేదని సొంత లాభం కొంత మానుకో లేరా? అని ప్రశ్నించారు, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్కలంక శ్రీనివాసరావు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ తరతరాలుగా ఆ రిజర్వేషన్ల అమలు నీడలోనే బతుకులు సాగిస్తాం అనడం కన్నా దౌర్భాగ్యం ఇంకొకటి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలలో ఉన్న రెండు సామాజిక వర్గాల వారు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లను తామే హక్కుదారులం అంటూ 47 సంవత్సరాల పోరాటం చేసి ఒకరి అభ్యున్నతిని మరొకరు అడ్డుకొని సభ్య సమాజం అవహేళన అయినా సందర్భాలు అనేకం ఉన్నాయని అన్నారు. వారితో పాటుగా వెనుకబడిన అనేక కులాలు వారి స్థితిగతులు నేటికీ ఎంతో దయనీయంగా ఉన్నాయని వీరి వ్యధ ప్రభుత్వాలకు పట్టడం లేదని, పైగా మాకంటే వెనకబడిన కులాలకు రాజ్యాంగ పలాలు అందడం లేదు దీనికి ప్రభుత్వం వైఫల్యాలే కారణం అంటూ వీరే అనేక బహిరంగ సభలో నినదించడం హాస్యాస్పదమని, రిజర్వేషన్ల పుణ్యమా అని తమ చుట్టూ ప్రహరీ గోడ కట్టుకొని భద్ర జీవితాలకు అలవాటు పడడమే కాదు ఇంజనీరింగ్ డాక్టర్ చదువులు ఎస్సీ కోటాలో పూర్తి అయిన వారు క్రైస్తవులుగా విదేశాలకు వెళ్లి మతం సామాజిక కార్యక్రమాల పేరిట అక్కడ నిధులు కొల్లగొట్టే ఎఫ్ సి ఆర్ ఏ లు ఎందరికి ఉన్నాయో ఆరా తీయాలని డిమాండ్ చేశారు. రెండు వైపులా ఫలాలను సుష్టుగా ఆరగిస్తూ తరతరాలుగా క్రైస్తవాన్ని నమ్ముకొని ఉన్న బీసీ(సీ ) ల కడుపు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇది ప్రజలను ప్రభుత్వాన్ని మోసగించడం కాదా? రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచనలకు ఆశయాలకు వ్యతిరేకం కాదా? అని ప్రశ్నించారు. ఇది ఆ మహనీయుడిని అడ్డం పెట్టుకొని ఆడుతున్న తంతు. వీరి కుమ్ములాటల నేపథ్యంలో మిగిలిన వెనుకబడిన తరగతుల కులాలవారు, (బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి ( ఆర్థికంగా అణగారిన ) ఇతర అణగారిన కులాల వారు ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయా కులాల వారు వాళ్ళ తమ బాగోగులను విషయం అడగడం కూడా మర్చిపోయేలా చేశారు. ఎక్కడో రోడ్ల పక్కన పిల్ల జల్లతో కలిసి కూటికి గూడుకు నోచుకోక ఏ చెట్ల కిందో తలదాచుకుంటున్నారో ఆ దేవుడికే ఎరక అన్నారు. ఇంతవరకు జరిగిన దారుణమంతా కేవలం రిజర్వేషన్లు సక్రమంగా అమలుకు నోచుకోని కారణంగా కొనసాగుతుందని సహృదయంతో గుర్తించాలని అన్నారు. బీసీలు ఇంకా మిగతా వర్గాలను బ్రాహ్మణులు ఎక్కడ ద్వేషించడం లేదని బ్రాహ్మణ జాతిలో కూడా అత్యంత దయనీయమైన స్థితిలో బతుకులు ఈడుస్తున్న వారు నేటికీ సమాజంలో ఉన్నారని, ఒక పూట ఉంటే మరొక పూట తినలేని పరిస్థితిలో ఉన్నారని, ఒక బ్రాహ్మణుడు గుడిలో పనిచేస్తే అతనిపై పదిమంది అధికారులు, నిఘా ఉంటుందని భక్తులు వేసే సంభవాన అర్చకుడి పళ్లెంలో పడకుండా హుండీలో వేయాలని అధికారుల ఆజమాయిషి నేపథ్యంలో బ్రాహ్మణ కుటుంబాలు కూటికి గుడ్డకు నోచుకోని స్థితిలో కొన్ని ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత లాభం కొంత మానుకోవడానికి సిద్ధపడాలి తక్షణమే ఈ ఆట కట్టించాలి. సమాజంలో అసమాన తలను రూపుమాపవలసిన బాధ్యత న్యాయస్థానాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతో ఉంది అని శ్రీనివాసరావు అన్నారు.

## సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది

### జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స

**అల్లూరి, ఏప్రిల్ 9 :** సరదాగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవాలని యువత పడుతున్న ఆరాటం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సెల్ఫీ మాయలో పడి తమ వైపు పొంచి ఉన్న ముప్పును తెలుసుకోలేక అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఎన్నో. అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. మృతులు త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16)ను హుకుంపేట మండలం జుంబువలస వాసులుగా స్థానికులు గుర్తించారు. ఇటీవలే వీరంతా ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. సెల్ఫీ పిచ్చి వీరిని ప్రమాదంలోకి నెట్టేసింది. తాజాగా అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ మల్లంగుమి గ్రామ సమీపంలో ఉన్న జలపాతం వద్ద నలుగురు యువతులు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయారు. వారిలో ముగ్గురు అమ్మాయిలు మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురమ్మాయిలు జలపాతం సమీపంలో నిలిచి ఉండగా.. మరొక అమ్మాయి సెల్ఫీ తీస్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నలుగురు అమ్మాయిలను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ముగ్గురు యువతులు మరణించారు. ఓ యువతిని రక్షించి ఆస్పత్రికి తరలించగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు బూర్జ పంచాయతీ జంబు వలస గ్రామానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. అంజలి అనే మరో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. యువతుల మృతితో జంబు వలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారం

### ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు

### ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**ఏలూరు, ఏప్రిల్ 9 :** ద్వారకా తిరుమల నకిలీ టికెట్ల స్కాం వ్యవహారంలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రవణ్ కుమార్ వెల్లడించారు. ప్రధాన నిందితుడు రాజుతోపాటు మరో ఆరుగురు దేవస్థానం ఉద్యోగులను అరెస్ట్ చేశామని చెప్పారు. గురువారం ఏలూరులో డీఎస్పీ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. నిందితుల వద్ద నుంచి నకిలీ టికెట్ల ప్రింటింగ్‌కు ఉపయోగించిన ల్యాప్‌ట్యాప్, ప్రింటర్, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది మార్చి రెండో వారంలో ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నకిలీ దర్శనం టికెట్ల విక్రయం బహిర్గతమైంది. ఆలయంలో స్కానింగ్ పాయింట్ వద్ద కొన్ని దర్శనం టికెట్లు స్కాన్ కాకపోవడంతో ఈ వ్యవహారం బట్టబయలు అయింది. ఈ వ్యవహారంలో దేవస్థానం ఏఈవో రమణరాజు కుమారుడు రాజు ప్రధాని నిందితుడు కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దేవాలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటిస్తుంటారు. భక్తులు.. కౌంటర్‌లో టికెట్లు కొనుగోలు చేసి దేవాలయంలో ప్రవేశించి.. స్కానింగ్ పాయింట్ వద్ద భద్రతా సిబ్బందికి వాటిని ఇస్తారు. వారు ఈ టికెట్లను స్కాన్ చేసి భక్తులను దేవాలయంలోకి అనుమతిస్తారు. ఆలయంలో ఏఈవో కుమారుడు రాజు దేవాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రూ.200 టికెట్లను అతడు టికెట్ కౌంటర్‌లో విక్రయించాడు. అవి ఆలయంలో స్కానింగ్ పాయింట్ల వద్ద స్కాన్ చేస్తే.. టికెట్లు స్కాన్ కావడం లేదు. దీంతో ఈ విషయాన్ని దేవస్థానం ఉన్నతాధికారుల దృష్టికి భద్రతా సిబ్బంది తీసుకెళ్లారు. వారు వెంటనే రంగంలోకి దిగి.. కౌంటర్‌లో జారీ చేసిన టికెట్లను పరిశీలించారు. అవి 61 టికెట్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ టికెట్లు జారీ చేసిన రాజును దేవస్థానం అధికారులు ప్రశ్నించారు. అనంతరం ఈ వ్యవహారంపై పోలీసులకు దేవస్థానం ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో ఈ కేసులో మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## అంగన్‌వాడీ టీచర్‌పై అఘాయిత్యం

### చెట్టుకు కట్టేసిన కొట్టిన ఐదుగురి అరెస్ట్

**సంగారెడ్డి, ఏప్రిల్ 9 :** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అంగన్‌వాడీ టీచర్ వసంత కుమారిని ఈడ్చుకెళ్లి చెట్టుకు కట్టేసి కొట్టారు గ్రామస్తులు. జుట్టు కత్తిరించి గాడిదాపై ఉరేగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. వద్దని ప్రాధేయపడ్డా కూడా కనికరించకుండా గ్రామస్తులు దారుణంగా వ్యవహరించారు. గంటకు పైగా అంగన్ వాడీ టీచర్ ను చిత్రహింసలకు గురిచేసినట్లు తెలిపారు. దీనికి గల కారణం ఏంటంటే.. అంగన్ వాడీ టీచర్ భర్త ఇన్సూరెన్స్ డబ్బులను గ్రామస్థుల నుంచి వసూలు చేసి తిరిగి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. భర్తపై ఉన్న కోపంతో సంబంధం లేని మహిళపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు గ్రామస్తులు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సోషల్ మీడియాకు కట్టడి ఉండాల్సిందే

### మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ

**అమరావతి, ఏప్రిల్ 9 :** మారుతున్న కాలంలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. దాని దుష్ప్రభావాల నుంచి భావి తరాలను కాపాడుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ బాధ్యత ప్రభుత్వంపైనా ఉందని నారా లోకేశ్ స్పష్టం చేశారు. పిల్లల డిజిటల్ భద్రత, మహిళల గౌరవంపై మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'పిల్లల మానసిక వికాసం దెబ్బతినకుండా ఉండేందుకు సోషల్ మీడియాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలన్నారు. 13 నుంచి 16 ఏళ్ల వయసు పిల్లలకు కేవలం వారి ఎదుగుదలకు, విద్యకు ఉపయోగపడే కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా విధివిధానాలను రూపొందించాలి. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని విద్వేషాలను చిమ్మేవారిని ఉపేక్షించేది లేదు. మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తించినా, అశ్లీల లేదా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినా కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాలు, అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న డిజిటల్ సేఫ్టీ చట్టాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యుత్తమ విధానాన్ని అమలు చేయాలి. పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాలకు దూరం చేయడం ఇప్పుడు అనివార్యం. వారి సృజనాత్మకతను కాపాడుతూనే, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని అన్నారు.


## జీవన్ రెడ్డి విమర్శలు సరికాదు : మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :** ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జీవన్ రెడ్డి అనడం సరికాదని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తానని చెబుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై జీవన్‌రెడ్డి విమర్శలు చేశారు. ఈ క్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విలేకర్ల సమావేశంలో మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిని ఓడించడమే ధ్యేయమని జీవన్ రెడ్డి అనడం సరికాదు. ఆయన ఎన్నికల్లో ఓడిన పది నిమిషాలకే రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఓడినా మంత్రి పదవి ఇస్తామని అన్నారు. ఓడినవారికి మంత్రి పదవి ఇవ్వకూడదన్న ఏఐసీసీ నిబంధన వల్లే ఇవ్వలేదు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీఫామ్ ఇచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.

### కాల్పుల విరమణ జరిగినా.. సైనిక బలగాలు

## ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

**స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**



**వాషింగ్టన్, ఏప్రిల్ 9 :** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్- అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

## పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

**ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించు కోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా-మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.



## ఇరాన్ ప్రతిపాదనలు.. చాట్‌జీపీటీ రాసింది : జేడీ వాన్స్

**వాషింగ్టన్ :** ఇరాన్‌తో కాల్పుల విరమణ కుదిరిన నేపథ్యంలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మూడు వర్షన్లలో తన 10 పాయింట్ల ప్రతిపాదనలు పంపిందన్నారు. అందులో ఒకటి చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని మీడియాతో అన్నారు. ఇరాన్ నుంచి వచ్చిన మూడు వేర్వేరు ప్రతిపాదనలు గందరగోళాన్ని సృష్టించాయని వాన్స్ పేర్కొన్నారు. తొలుత 10 పాయింట్లతో ఒక ప్రతిపాదనను పంపించినట్లు వెల్లడించారు. అయితే, అది చాట్‌జీపీటీ రాసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లకు ఆ ప్రతిపాదనలు అందాయన్నారు. వెంటనే వారు వాటిని తిరస్కరించినట్లు వెల్లడించారు. ఇరాన్ ప్రతిపాదనలకు సంబంధించిన రెండో వర్షన్ కూడా ఉందన్నారు. కాల్పుల విరమణ ప్రకటనలో అధ్యక్షుడు ట్రంప్ దాన్నే ప్రస్తావించారన్నారు. ప్రతిపాదనలకు సంబంధించిన మూడో వర్షన్ మొదటి దానికంటే అత్యంత దారుణంగా ఉందని, అంగీకరించలేనివిధంగా అందులో డిమాండ్లు ఉన్నాయన్నారు. సోషల్ మీడియా ద్వారా ఈ మూడో ప్రతిపాదన గురించి తమకు తెలిసిందన్నారు. లెబనాన్ కారణంగా.. కాల్పుల విరమణ విఫలం కాకుండా చూడాలని వాన్స్ ఇరాన్‌ను కోరారు. ఈ సీజ్‌ఫైర్ నిబంధనల్లో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాల గురించి చేర్చలేదన్నారు.

**వాన్స్ నేతృత్వంలో పాక్‌లో చర్చలు..**

ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య తొలి దశ చర్చలు ఈ శనివారం ప్రారంభం కానున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో అమెరికా బృందం ఈ చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

### పాక్‌ను ముందు పెట్టి

# అమెరికా నాటకం

**హోర్ముజ్ తెరుచుకునేలా కాల్పుల విరమణ**

**లెబనాన్‌పై దాడులతో మళ్లీ పీటముడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9 :** 40 రోజుల పాటు కొనసాగిన యుద్ధానికి తెర దించుతూ అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో రెండు దేశాల మధ్య రాజీ కుదిరింది. రెండు దేశాల మధ్య రాజీ కుదర్చటాన్ని పాకిస్థాన్ గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. తనను తాను శాంతిదూతగా చెప్పుకుంటోంది. ఇలాంటి సమయంలో బ్రిటన్‌కు చెందిన ది ఫైనాన్షియల్ టైమ్స్ న్యూస్ పేపర్ సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం.. అమెరికా ఒత్తిడి కారణంగానే పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. ఇరాన్, అమెరికాల మధ్య రాజీ కుదిరితే హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకుంటుందని అమెరికా భావించింది. అందుకే ఇరాన్‌ను యుద్ధం ఆపేలా ఒప్పించమని పాకిస్థాన్‌ను కోరింది. గత కొన్ని వారాల నుంచి ట్రంప్ ప్రభుత్వం పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచింది. అమెరికా ఒత్తిడి కారణంగానే బలవంతంగా ఇరాన్‌తో చర్చలకు పాకిస్థాన్ ఒప్పుకుంది. ఎంతో కష్టం మీద ఇరాన్‌ను రాజీకి ఒప్పించింది. అమెరికాకు సంబంధించినంత వరకు పాకిస్థాన్ మధ్యవర్తి కాదు.. ఇరాన్‌తో సంధి చేసుకోవడానికి ఓ మార్గం మాత్రమేనని ది ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఇజ్రాయెల్ కారణంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విఫలం అయ్యేలా ఉంది. ఇజ్రాయెల్ లెబనాన్‌పై మిస్సైల్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసి వేసింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ది ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. 'అమెరికా ఈజ్ బ్యాక్. ఇప్పటికే బలహీనపడిన శత్రువును పూర్తిగా నిర్మూలించేందుకు సిద్ధంగా ఉన్నాం. హోర్ముజ్‌ను తెరవకపోతే దాడులు తప్పవు. ఒప్పందం కుదరకపోతే ఈసారి తీవ్రమైన దాడులు చేస్తాం. ఎన్నడూ లేని విధంగా ఇరాన్‌పై విరుచుకుపడతాం. ఇప్పటికే ఇరాన్ చుట్టూ అమెరికా బలగాలున్నాయి. అణ్వాయుధాలను ఇరాన్ వదలాల్సిందేనని రాసుకొచ్చారు. అయితే ఇరాన్ కూడా పట్టుదలగానే ఉంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ మరోసారి హోర్ముజ్ జలసంధిని మూసివేసింది.

అమెరికా, ఇరాన్‌లు బుధవారం రెండు వారాల కాల్పుల విరమణను ప్రకటించాయి. దీనిలో భాగంగా, ప్రపంచ ఇంధన సరఫరాలను పునరుద్ధరించేందుకు వీలుగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. అమెరికా తీసుకున్న నిర్ణయానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మద్దతు తెలిపారు. అయితే లెబనాన్‌తో కాల్పుల విరమణ ఉండదని చెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. పది నిమిషాల వ్యవధిలో లెబనాన్‌లోని ప్రలు ప్రాంతాలపై సుమారు 100 ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. ఈ దాడుల్లో దాదాపు 180 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. 837 మంది గాయాల పాలయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేసింది. మెరికా- ఇరాన్ మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో హిజ్బుల్లాను చేర్చలేదని పేర్కొంటూ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక చర్యకు ట్రంప్ మద్దతు తెలిపారు. 'లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యను ఒప్పందం నుంచి ఎందుకు మినహాయించార'ని ప్రశ్నించగా.. 'హిజ్బుల్లా కారణంగానే లెబనాన్‌ను ఒప్పందంలో చేర్చలేదు. అది కూడా త్వరలోనే పరిష్కారమవుతుంది. ఫర్వాలేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

## పురుషులనూ అనుమతించని ఆలయాలున్నాయ్

**'శబరిమల' అంశంపై కేంద్రం**



**న్యూఢిల్లీ:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో 10-50 ఏళ్ల వయసు మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి సమర్థించింది. ఇది మహిళలపై వివక్ష కాదని, ఏళ్లుగా కొనసాగుతోన్న ఆచారాన్ని గౌరవించడమేనని పేర్కొంది. మన దేశంలో పురుషులనూ అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసుపై సుప్రీంకోర్టు మూడోరోజు గురువారం కూడా విచారణ కొనసాగించింది. ఈసందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి సమర్పించారు. ఇందులో పలు ఆలయాల గురించి ప్రస్తావించారు. "మన దేశంలో పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయి. దేవి భగవతి ఆలయంలో కొన్నేళ్లుగా ఇలాంటి ఆచారం కొనసాగుతోంది. ఇక కేరళలోని ఓ ఆలయంలోకి అబ్బాయిలు మహిళల వేషధారణలో వెళ్తారు. అందుకోసం వారు బ్యూటీపార్లర్‌కు వెళ్లి మరీ అమ్మాయిల్లా తయారవుతారు. కాబట్టి ఇది పురుషాధిక్య లేదా స్త్రీ ఆధిక్య మత విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్న కాదు" అని తుషార్ మెహతా తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లంఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా దీనిపై సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

## కర్ణాటకలో ట్రెక్కింగ్.. మరో కేరళ అమ్మాయి మిస్సింగ్

**కర్ణాటక :** కర్ణాటక కొండల్లో ట్రెక్కింగ్‌కు వెళ్లిన కేరళకు చెందిన ఓ బాలిక మిస్ అయ్యింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మొన్నటికి మొన్న కేరళకి చెందిన ఓ టెకీ కర్ణాటక కొండల్లో ట్రెక్కింగ్‌కి వెళ్లి మిస్ అయ్యింది. పోలీసులు జరిపిన సెర్చ్ ఆపరేషన్‌తో నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ లభ్యం అయ్యింది. మళ్లీ అలాంటి ఘటనే చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో పోలీసులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేరళలోని పాలక్కడ్ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక కర్ణాటకలోని చంద్రద్రోణ హిల్స్ పైకి ఏప్రిల్ 7న దాదాపు 40 మంది కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లింది. అదేరోజు సాయంత్రం బృందం నుంచి ఆ బాలిక దారి తప్పిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో మరుసటి రోజు తమకు ఫిర్యాదు చేశారని పోలీసు అధికారులు పేర్కొన్నారు. "వెంటనే బాలిక కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాం. కొండలపై తాళ్ల సాయంతో వెతకడం ప్రారంభించాం. రాత్రి వేళల్లో డ్రోన్లతోనూ ఆమె కదలికలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాం. కేరళ పోలీసులు కూడా ఈ దర్యాప్తులో భాగం అయ్యారు" అని కర్ణాటక పోలీసులు పేర్కొన్నారు. కేరళకు చెందిన శరణ్య అనే యువతి ఏప్రిల్ 2న కర్ణాటకలో ట్రెక్కింగ్‌కు వెళ్లి తప్పిపోయిన విషయం తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం భారీ సెర్చ్ ఆపరేషన్‌తో ఎట్టకేలకు నాలుగు రోజుల తర్వాత ఆమె ఆచూకీ లభ్యమైంది.

## అత్తారింట్లో వంట గదిలోకి అనుమతించకపోవడమూ క్రూరత్వమే



**ముంబాయి :** అత్తారింట్లో మహిళను వంట గదిలోకి అనుమతించకపోవడమూ మానసిక క్షోభకు గురిచేయడం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు తేల్చింది. భర్త తనను వంటగదిలోకి రానివ్వడం లేదంటూ ఇటీవల ఓ మహిళ అతడిపై కేసు పెట్టింది. దీంతో అతడు బాంబే హైకోర్టుని ఆశ్రయించాడు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతో పాటు మానసిక క్షోభకు గురి చేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. వారిద్దరూ 2022లో వివాహం చేసుకున్నారు. కొద్దికాలానికే వారి మధ్య వివాదాలు మొదలయ్యాయి. దీంతో అత్తింటివారంతా ఆమె ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. "నన్ను అసలు వంట గదిలోకే అనుమతించలేదు. ఆహారం కూడా బయట నుంచి తెచ్చుకోవాలని బలవంత పెట్టారు. పుట్టింటి వాళ్లని కూడా కలవనివ్వలేదు. విడాకులు ఇవ్వాలని ఇబ్బందిపెడుతున్నారు" అని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణలను ఆమె భర్త ఖండించారు. "విడాకులు ఇవ్వాల్సివస్తుందనే కారణంతోనే ఆమె ఇవన్నీ సృష్టించారు" అని ఆమె భర్త తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. దీనిపై విచారణ చేసిన ధర్మాసనం అతనిపై వేధింపుల కేసును కొట్టివేసేందుకు అంగీకరించలేదు. ఇంట్లో ఆమె సాధారణ అవసరాలను కూడా తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం కూడా మానసిక క్రూరత్వం కిందకే వస్తుంది అని పేర్కొంది. కానీ ఈ కేసులో ఆమె అత్తపై చేసిన ఆరోపణలు అస్పష్టంగా ఉన్నాయంటూ ధర్మాసనం కొట్టివేసింది.

### నెతన్యాహూకు స్వదేశంలో

## తీవ్ర వ్యతిరేకత

- కాల్పుల విరమణ.. రాజకీయ వైఫల్యం
- ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు



**టెలిఅవీవ్, ఏప్రిల్ 9 :** యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానా లన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.




## హర్మూజ్ నుంచి వెనుదిరుగుతున్న నౌకలు

**హర్మూజ్ :** కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. ఈ దాడులపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనికి సంబంధించిన కీలక విషయం వెలుగులోకి వచ్చింది. జలసంధిని పూర్తిగా మూసేయడంతో.. దీని మీదుగా వెళ్లాల్సిన నౌకలు బలవంతంగా వెనక్కి మరలుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. గ్రీక్‌కు చెందిన బల్క్ క్యారియర్ 'చీజీ ఝుతీష్ట్ర', లైబీరియా జెండా కలిగిన 'ఝువ్‌శీఝ దీఝుఎష్ట్ర' అనే రెండు నౌకలు హర్మూజ్‌ను దాటాయి. కాల్పుల విరమణ తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ క్రమంలో చమురు నౌక కూడా జలసంధిని దాటేందుకు సిద్ధమైంది. అయితే, అప్పటికే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో.. ఇరాన్ హర్మూజ్‌ను పూర్తిగా మూసివేసింది. దీంతో ముసందమ్ తీరం సమీపంలో ఈ నౌక బలవంతంగా వెనుదిరగాల్సి వచ్చింది. అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన ఈ మార్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. దీంతోపాటు మరికొన్ని నౌకలు కూడా ఇలానే వెనుదిరిగినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇక, మంగళవారం నాటికి సరకుతో నిండిన 187 ట్యాంకర్లు సహా వెయ్యికి పైగా నౌకలు హర్మూజ్ జలసంధి సమీపంలోనే ఉన్నాయని క్లెప్లర్ పేర్కొంది. పరిస్థితులు చక్కబడి సాధారణ రాకపోకలు ప్రారంభమైనా.. ఈ నౌకలు జలసంధిని దాటేందుకు రెండు వారాలకు పైనే పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### నేపాల్‌లో మరో మాజీ ప్రధాని

## అరెస్ట్‌కు రంగం సిద్ధం




**నేపాల్ :** నేపాల్‌లో ఇటీవలే బాలేంద్ర షా నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ఆ తర్వాత వరుసగా మాజీ నాయకులపై అరెస్ట్ వారెంట్లు జారీ అవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తాజాగా నేపాల్ మరో మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవుబాపై కూడా ప్రభుత్వం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. గతంలో బాలేంద్ర అధికారంలోకి వచ్చిన కొన్ని గంటల్లోనే మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. షేర్ బహదూర్ మనీ లాండరింగ్, అవినీతి కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. "నాపై వచ్చిన మనీ లాండరింగ్ ఆరోపణలను ఖండిస్తున్నా. నా కుటుంబ ఆస్తులకు సంబంధించి తప్పుడు ప్రచారం జరుగుతోంది" అని బహదూర్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. మాజీ ప్రధాని పైనే కాకుండా అతని భార్య మాజీ విదేశాంగ శాఖ మంత్రి అర్జు రాణా దేవుబాపై కూడా అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్టు ఖాట్మండ్ కోర్టు అధికారులు తెలిపారు. బహదూర్, ఆయన భార్య కూడా ప్రస్తుతం వైద్యచికిత్స నిమిత్తం విదేశాల్లో ఉన్నట్టు తెలిపారు. వీరిద్దరూ సింగపూర్‌లో ఉన్నారని జాతీయ మీడియా సంస్థలు రాసుకొచ్చాయి. గత నెలలో జరిగిన ఎన్నికల్లో 35 ఏళ్ల బాలేంద్ర షా భారీ విజయం సాధించి, చరిత్ర సృష్టించి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత కొన్ని గంటలకే నేపాల్ మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్టయ్యారు. గతేడాది దేశంలో జరిగిన జెన్‌జీ నిరసనలను హింసాత్మకంగా అణచివేశారనే ఆరోపణలపై ఓలీపై ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

# స్మార్ట్‌టీవీల్లో ఇకపై 90 సెకన్ల యూట్యూబ్ యాడ్స్




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్‌టీవీల్లో సుదీర్ఘ అన్‌స్కిప్పబుల్ యాడ్స్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఏకంగా 90 సెకన్ల వరకు స్కిప్ చేయలేని యాడ్స్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నట్లు తెలిసింది. ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఈతరహా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, దీనిపై యూట్యూబ్ నుంచి అధికార ప్రకటన రావాల్సిఉంది. ఇప్పటివరకు స్మార్ట్‌టీవీల్లో 30 సెకన్ల అన్‌స్కిప్పబుల్ యాడ్స్ మాత్రమే వస్తున్నాయి. దాని స్థానంలో 90 సెకన్ల పాటు ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 20 నిమిషాల నుంచి 40 నిమిషాల నిడివి కలిగిన వీడియోలకు ఈ తరహా యాడ్స్‌ను పుష్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు యూజర్లకు 90 సెకన్ల యాడ్స్ కనిపిస్తున్నాయి. సంబంధిత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకొని అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు సంప్రదాయ ప్రకటనదారులను ఆకర్షించడం.. మరోవైపు యాడ్స్ వద్దనుకునే యూజర్లను ప్రీమియం వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ మార్పు చేస్తున్నట్లు టెక్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



## బిజినెస్




## వరుస లాభాలకు బ్రేక్..

### సెన్సెక్స్ 931 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల ఐదు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లు పైకి కనిపించినా.. నివురుగప్పిన నిప్పులా ఎప్పుడు రాజుకుంటాయోనన్న భయాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం కుదరడంతో యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయినట్లు కనిపించినా.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఈ దాడులకు ప్రతిగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. దీంతో మళ్లీ అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం స్టాక్ మార్కెట్‌లపై ప్రతికూల ప్రభావం పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, ఎఫ్ఐఐల విక్రయాలూ తోడయ్యాయి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,319.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,562.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కనిపించింది. ఇంట్రాడేలో 76,347.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 931.25 పాయింట్ల నష్టంతో 76,631.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 222.25 పాయింట్లు నష్టపోయి 23,775.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎల్‌అండ్‌టీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో మళ్లీ ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ప్రకటనతో 95 డాలర్ల దిగువకు చేరిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర.. మళ్లీ 98.42 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ 4728 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## విదేశాలకు భారత్ మోడల్..

### క్విక్ కామర్స్ సేవలకు అమెజాన్ రెడీ




**ఢిల్లీ:** దేశంలో క్విక్ కామర్స్ ఎంత పాపులరో మనందరికి తెలిసిందే. 10 నిమిషాల డెలివరీ పేరిట ఆరంభమైన ఈ సేవలు చూసి విదేశాల నుంచి వచ్చిన చాలా మంది ఆశ్చర్యపోయారు కూడా. దేశంలో అంతటి ప్రాచుర్యం పొందిన ఈ సేవలను ఇప్పుడు అమెజాన్ అమెరికా, యూరప్‌లో అందించేందుకు సిద్ధమవుతోంది. దేశీయంగా 'అమెజాన్ నౌ' పేరిట క్విక్ కామర్స్ సేవలు విజయవంతం అయిన నేపథ్యంలో అక్కడా ఈ సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కంపెనీ డాక్యుమెంట్ ద్వారా తెలిసింది. గతేడాది భారత్, యూఏఈలో క్విక్ కామర్స్ సేవలను అమెజాన్ ప్రారంభించింది. "అమెజాన్ నౌ అల్ట్రా ఫాస్ట్ డెలివరీ సేవల ద్వారా కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఐటెమ్స్ డెలివరీ చేస్తున్నాం. కస్టమర్లూ దీన్ని ఆదరిస్తున్నారు. భారత్‌లో సుమారు 360 మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నాయి. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అమెజాన్ నౌ ఆర్డర్లు నెలవారీ 25 శాతం వృద్ధి నమోదవుతోంది. ఈ సేవలను అమెరికా, యూరప్‌లోనూ ప్రారంభించాలనుకుంటున్నాం" అని అమెజాన్ డాక్యుమెంట్లో ఉంది. ఎలాంటి డిస్కౌంట్లూ లేకున్నా 70 శాతం మంది వినియోగదారులు క్విక్ కామర్స్ సేవలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారని గ్రాంట్‌థార్టన్ నివేదిక పేర్కొంది. ఇతర ఇ-కామర్స్ ఫార్మాట్‌లతో పోలిస్తే 11 రెట్లు వేగంగా వృద్ధి చెందుతోందని రెడ్‌సీర్ అనే మరో నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలో ఇతర దేశాల్లోనూ తన క్విక్ కామర్స్ సేవలను విస్తరించేందుకు అమెజాన్ సిద్ధమైంది.

# మారని కోల్‌'కథ'

## లఖ్‌నవూను గెలిపించిన ముకుల్ చౌదరి



**కోల్‌కతా:** ఐపీఎల్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 181/4 స్కోరు చేసింది. ఈ లక్ష్యాన్ని లఖ్‌నవూ సరిగ్గా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆయుష్ బదోని (54; 34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఒక దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన లఖ్‌నవూను ముకుల్ చౌదరి (54; 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి గెలిపించాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్ తలో 2, సునీల్ నరైన్, కార్తిక్ త్యాగి, కామెరూన్ గ్రీన్ తలో వికెట్ పడగొట్టారు. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన కోల్‌కతాకు ఇది మూడో ఓటమి. పంజాబ్‌తో ఆడాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో కేకేఆర్‌కు ఓ పాయింట్ దక్కింది.



### ఆఖరి ఓవర్లో ఏం జరిగిందంటే..

లఖ్‌నవూ విజయానికి ఆఖరి ఓవర్లో 14 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో ఉన్న అవేశ్ ఖాన్ మొదటి బంతికి సింగిల్ తీసి, ముకుల్ చౌదరికి స్ట్రైక్ అందించాడు. రెండో బంతికి ముకుల్ సిక్స్ బాదాడు. అప్పుడు సమీకరణం 4 బంతుల్లో 7 పరుగులుగా మారింది. 3, 4 బంతులకు పరుగులు రాకపోవడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. 2 బంతులకు 7 పరుగులుగా సమీకరణం మారింది. అయితే అయిదో బంతికి ముకుల్ సిక్స్ బాదడంతో స్కోర్లు సమమయ్యాయి. ఆఖరి బంతికి షాట్ మిస్ అయినా... బై రూపంలో ఒక పరుగు రావడంతో లఖ్‌నవూ గట్టెక్కింది. తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా బ్యాటర్లలో కెప్టెన్, ఓపెనర్ అజింక్య రహానె (41; 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), వన్‌డౌన్ బ్యాటర్ రఘువంశీ (45; 33 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. రొవ్‌మన్ పావెల్ (39; 24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కామెరూన్ గ్రీన్ (32; 24 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిశారు. లఖ్‌నవూ బౌలర్లలో ప్రిన్స్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్, దిగ్వేశ్ రాఠీ, అవేశ్ ఖాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



## ఐపీఎల్‌లో సరికొత్త రూల్!

సాధారణంగా ఐపీల్ మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌లో ఉండే ఆటగాళ్లు పదే పే మైదానంలోకి రావడం చూస్తూనే ఉంటాం. డ్రింక్స్ అందించడానికో, బ్యాట్లు మార్చడానికో, లేదా కోచ్ చెప్పే సమాచారాన్ని చేరవేయడానికో వస్తూ ఉంటారు. అయితే దీని వల్ల మ్యాచ్ సమయం వృథా అవుతుందని గ్రహించిన బీసీసీ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లో మార్పులు చేసింది. బీసీసీఐ తాజాగా ఫ్రాంచైజీలకు పంపిన సమాచారం ప్రకారం... మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇచ్చిన టీమ్ షీట్‌లో చెప్పిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే అంటే 11మంది జట్టు సభ్యులు ఐదుగురు సబ్‌స్టిట్యూట్లకు మాత్రమే మైదానంతో సంబంధం ఉంటుంది. ఈ 16 మందిలో లేని మిగతా స్క్వాడ్ సభ్యులలు ఎవరూ కూడా ఆట జరుగుతున్న సమయంలో మైదానంలోకి అడుగు పెట్టడానికి లేదు. సాధారణంగా రిజర్వ్ ప్లేయర్లు డ్రింక్స్ లేదా సమాచారాన్ని తీసుకెళ్తుంటారు. కానీ కొత్త రూల్స్ ప్రకారం టీమ్ షీట్‌లో లేని ఆటగాళ్లు డ్రింక్స్, బ్యాట్లు లేదా ఎలాంటి సందేశాలు పట్టుకొని రావడానికి లేదు. మ్యాచ్ జరుగుతున్న టైంలో కేవలం ఐదుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మాత్రమే మైదానం చుట్టూ తిరగడానికి అనుమతి ఉంటుంది. మిగిలిన వారు కచ్చితంగా డగౌట్‌కే పరిమితం కావాలి. వారు బౌండరీ లైన్, ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల మధ్య తిరగడానికి లేదు. మైదానం లోపల లేదా బౌండరీ పరిసరాల్లో ఉండే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించాలి. ఇది వారి ఆడుతున్న ఆటగాళ్ల నుంచి వేరుగా గుర్తించడానికి సహాయపడుతుంది. ఈ కొత్త మార్పులు ఇప్పటికే ఉన్న మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లోని క్లాజ్ 11.5.2, 24. 1.4లకు అదనంగా చేర్చారు. క్లాజ్ 11.5.2 ప్రకారం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే సమయం వృథా కాకుండా డ్రింక్స్ అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా కూల్స్ డ్రింక్స్ మైదానంలోకి తీసుకురాకూడదు. క్లాజ్ 24.1.4 ప్రకారం మ్యాచ్‌లో ఆడని ఆటగాళ్లు మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా బిబ్స్ ధరించాలని స్పష్టం చేస్తుంది. ఈ రూల్ వల్ల జట్ల వ్యూహాలై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా క్లిష్ట సమయంలో డగౌట్ నుంచి ఆటగాళ్లు సందేశాలు పంపడం ఇప్పుడు కొంత కష్టతరం కావచ్చు. కేవలం నిర్ణీత 16 మంది ద్వారానే కమ్యూనికేషన్ జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ఆదేశాలను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అన్ని ఫ్రాంచైజీలకు చేరవేసింది.

## చెన్నై జట్టును తక్కువ అంచనా వేయలేం

### సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్




ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ముగియగా, జట్ల మధ్య పోరు హోరాహోరీగా మారుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి ఫోకస్ ఎంఎస్ ధోనీపైనే ఉంది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ చెన్నై జట్టుపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధోనీ లేకపోవడం సీఎస్‌కే బలాన్ని తగ్గిస్తుందని తాను భావించడం లేదని క్లాసెన్ స్పష్టం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉందని, వారు ఎప్పుడూ పటిష్ఠమైన జట్టుగానే బరిలోకి దిగుతారని హెన్రిచ్ క్లాసెన్ పేర్కొన్నారు. "ధోనీ మైదానంలో లేనంత మాత్రాన ఆ జట్టు బలహీనపడదు. వారి సెటప్‌లో ఉన్న ప్రతి ఆటగాడు ప్రతిభావంతుడే. విదేశీ ఆటగాళ్లతో పాటు స్వదేశీ కుర్రాళ్లు కూడా మ్యాచ్‌ను గెలిపించగలరు" అని క్లాసెన్ అభిప్రాయపడ్డారు. జియోస్టార్ ప్రెస్ రూమ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన సీఎస్‌కే జట్టుపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ధోనీ లేకపోవడం వల్ల తమ పని సులభం అవుతుందని తాము అనుకోవడం లేదని ఆయన తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మరో కీలక ఆటగాడి రాకతో మరింత బలం పెరిగినట్లయ్యింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరబోతున్నాడని క్లాసెన్ వెల్లడించారు. ధోనీలాగే బ్రెవిస్ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడటం వల్ల మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బ్రెవిస్ మిడిల్ ఆర్డర్‌లో వస్తే చెన్నై బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుందని, అది తమ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని క్లాసెన్ చెప్పుకొచ్చారు. క్లాసెన్ తన సొంత దేశపు ఆటగాడైన బ్రెవిస్ సామర్థ్యం గురించి మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించారు. చెన్నై జట్టు టాప్ ఆర్డర్ గురించి మాట్లాడుతూ క్లాసెన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కొత్తగా జట్టులో చేరిన సంజు శామ్సన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేదు. అయితే ఇలాంటి క్లాస్ ప్లేయర్లు ఎప్పుడైనా ఫామ్ అందుకునే అవకాశం ఉందని, వారు ఫామ్ లోకి వస్తే ఆపడం చాలా కష్టమని అన్నారు. వారు తమపై జరిగే మ్యాచ్‌లో కూడా ఫెయిల్ కావాలని తాము కోరుకుంటున్నామని, తద్వారా చెన్నైని ఒత్తిడిలోకి నెట్టవచ్చని క్లాసెన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రస్తుతం ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇషాన్ కిషన్ కెప్టెన్?గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో సన్‌రైజర్స్ కేవలం ఒక్క విజయాన్ని మాత్రమే నమోదు చేసింది. ఇషాన్ కిషన్ నాయకత్వంలో జట్టు మళ్లీ విజయాల బాట పట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. క్లాసెన్ కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. చెన్నై వంటి పెద్ద జట్లతో ఆడేటప్పుడు గెలవడం ద్వారా జట్టులో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, అందుకే ఏప్రిల్ 18న జరిగే మ్యాచ్ తమకు అత్యంత కీలకమని అన్నారు. ఎంఎస్ ధోనీ మైదానంలో లేకపోయినా అతని ప్రభావం జట్టుపై కచ్చితంగా ఉంటుందని క్లాసెన్ విశ్లేషించారు. "ధోనీ డగౌట్‌లో కూర్చుని తన అనుభవాన్ని కుర్రాళ్లకు షేర్ చేస్తుంటారు. అతని వ్యూహాలు ఎప్పుడూ పనిచేస్తాయి. గత రెండు సీజన్లలో కేవలం ఆఖరి 10 బంతులు మాత్రమే ఆడుతూ వచ్చాడు. కాబట్టి అతను లేకపోవడం బ్యాటింగ్ పరంగా పెద్ద లోటు కాకపోవచ్చు, కానీ మెంటార్‌గా ఆయన ఇచ్చే సూచనలే డేంజరస్" అని క్లాసెన్ తెలిపారు. ధోనీ ఇచ్చే సలహాలతో చెన్నై ఆటగాళ్లు మరింత ప్రమాదకరంగా మారుతారని హెచ్చరించారు.




## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి ఫస్ట్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ వచ్చేసింది

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి ప్రవేశించింది. ఫ్లయింగ్ ఫ్లీ సీ6 పేరిట తన తొలి ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్‌ను గురువారం విడుదల చేసింది. సిటీం ఎలక్ట్రిక్ మొబిలిటీ బ్రాండ్‌పై దీన్ని తీసుకొచ్చింది. ఈ మోటార్ సైకిల్ ధరను రూ.2.79 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్ ధర) నిర్ణయించింది. బ్యాటరీ యాజ్ ఏ సర్వీసెస్ విధానంలో అయితే రూ.1.99 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 10 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. మే నెల నుంచి వాహనాన్ని డెలివరీ చేయనున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్లయింగ్ ఫ్లీ సీ6లో 3.91 కిలోవాట్ అవర్ బ్యాటరీని ఇచ్చారు. ఇందులో 15.4 మోటార్‌ను అమర్చారు. దీని గరిష్ఠ వేగం గంటకు 115 కిలోమీటర్లు. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 3.7 సెకన్ల వ్యవధిలో అందుకుంటుందని రాయల్ ఎన్‌ఫీల్డ్ వెల్లడించింది. ఒకసారి ఛార్జ్ చేస్తే 154 కిలోమీటర్లు (ఐడీసీ రేంజ్) ప్రయాణించవచ్చని చెబుతోంది. కేవలం 65 నిమిషాల్లో 20 శాతం నుంచి 80 శాతం బ్యాటరీని రీఛార్జి చేయొచ్చని పేర్కొంది. ముఖ్యంగా నగరవాసులే లక్ష్యంగా ఈ మోటార్ సైకిల్‌ను రాయల్ ఎన్‌ఫీల్డ్ తీసుకొచ్చింది. ఫ్రేమ్ మొత్తం బయటికి కనిపించేలా కాంపాక్ట్ డిజైన్‌తో రూపొందించారు. ఫ్లోటింగ్ సీటు, డిటాచ్‌బుల్ పిల్లియన్ సీటు ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌లైట్లు, గూగుల్ సాయంతో పనిచేసే ఆన్‌బోర్డ్ నావిగేషన్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, కార్నరింగ్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఉన్నాయి. స్పోర్ట్, ఇండివిడ్యువల్ మోడ్‌లు ఉన్నాయి. ఈ మోటార్ సైకిల్ బరువు 124 కిలోలు. రాయల్ ఎన్‌ఫీల్డ్ నుంచి వచ్చిన అతి తక్కువ బరువు గల మోటార్ సైకిల్ ఇదే కావడం గమనార్హం.

జనం వార్త

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్





అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.



# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

## సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్

కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.



# ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నా : కృతి శెట్టి

ఉప్పెన' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కృతి శెట్టి, త్వరలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రేజీ లవ్ స్టోరీలో కృతి సరసన 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితంలోని బ్రేకప్‌ల గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో కృతి శెట్టి తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయి-ఎపోయింది. "నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను. కానీ గతంలో నా జీవితంలో ఒకసారి బ్రేకప్ జరిగింది. ఆ విషయం మా అమ్మకు కూడా తెలుసు. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే.. ఎవరైనా నా గురించి కావాలని నెగిటివ్‌గా ప్రచారం చేస్తే మాత్రం వెంటనే వారిని బ్లాక్ చేస్తాను" అంటూ క్లారిటీ ఇచ్చింది. కృతి చేసిన ఈ బ్రేకప్ కామెంట్స్ చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఇక హీరో ప్రదీప్ రంగనాథన్ తనదైన స్టైల్‌లో ఫన్నీగా స్పందించాడు. "నేను సింగిల్ అని చెప్పుకోవడానికే గర్వపడతాను. నా జీవితంలో ఒకటి కాదు, చాలా బ్రేకప్‌లు జరిగాయి. నేనైతే ఎవరినీ బ్లాక్ చేయలేదు కానీ, అవతలి వాళ్లే నన్ను బ్లాక్ చేశారు. ముఖ్యంగా నా కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు నేను జస్ట్రఫ్-ట్రూ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడిని" అంటూ నవ్వులు పూయించాడు. ఒకప్పుడు అంతలా రిప్లైలు ఇచ్చినా ఇప్పుడు మాత్రం సింగిల్‌గానే మిగిలిపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.



# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా – కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.





# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్


## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎౖఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ఓటీటీలో మలయాళ బ్లాక్‌బస్టర్ మిస్టరీ థ్రిల్లర్..

ఆసక్తికర కథ, కథనాలతో ప్రేక్షకులను అలరిస్తుంటాయి మలయాళ చిత్రాలు. ముఖ్యంగా క్రైమ్, మిస్టరీ థ్రిల్లర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు అలాంటి చిత్రమే ఓటీటీ ప్రేక్షకులను పలకరించడానికి రాబోతోంది. జీతూ సతీషన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంభవం అధ్యాయం ఒన్ను'. అస్కర్ అలీ, వినీత్ కుమార్, అస్సిమ్ జమాల్, సిద్ధార్థ్ భరత్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం మార్చి ఫస్ట్ వీక్‌లో మలయాళంలో విడుదలైంది. అతి తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ మూవీ సుమారు రూ.6కోట్లకు పైగా వసూలు చేసింది. మిస్టరీ హారర్ అంశాలకు టైమ్ ట్రావెల్ పాయింట్‌ను సినిమాను తీర్చిదిద్దిన విధానానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. థియేటర్‌లో అలరించిన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీలో మలయాళంతో పాటు, ఇతర భాషల సినీ అభిమానులను అలరించడానికి సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఏప్రిల్ 15వ తేదీ నుంచి తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. టైమ్‌లూప్ కాన్సెప్ట్‌తో మన దగ్గరా కొన్ని చిత్రాలు, వెబ్‌సిరీస్‌లు వచ్చాయి. జీతూ సతీషన్ కూడా 'సంభవం అధ్యాయం ఒన్ను' కోసం ఇదే కాన్సెప్ట్‌ను ఉపయోగించారు. కర్ణాటక – కేరళ సరిహద్దుల్లో అటవీ ప్రాంతంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ అవుతాడు ఆనంద్ (అస్గర్ అలీ). అదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న రెజీ, స్టీఫెన్ అనే పోలీసులు నైట్‌డ్యూటీకి వెళ్లగా అడవిలో ఓ శవం కనిపిస్తుంది. ఆ మృతదేహం దగ్గరకు వెళ్లిన వాళ్లు ఓ ఆలయంలో చిక్కుకుపోతారు. విషయం తెలుసుకుని అడవిలోకి వచ్చిన ఆనంద్, అతడి టీమ్‌కు విచిత్ర అనుభవాలు ఎదురవుతాయి. ఇంతకీ ఆ మృతదేహం ఎవరిది? ఎవరు హత్య చేశారు? కాకి ఆకారంలో ఉన్న ఆలయం వెనకున్న మిస్టరీ ఏంటి? అన్నది చిత్ర కథ.



# పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com